# ఆనాటి కాంతం

కాంతం : ఊ– తమలపాకులు చిలకలు చుట్టి యిస్తావుంటానుగాని, నముల్తూ ఏమన్నా కబుర్లు చెప్పండి.

వెంకట్రావు : అవునే కాంతం – యిన్నేళ్ళయినా, రోజూ నువ్వు తమలపాకులు చుట్టివ్వడం, నేను తినడం మానలేదు గదా!

కాంతం : ఎల్లా మాన్తారు లెండి. చేసేది బడిపంతులు ఉద్యోగం అయినా, దర్జాకీ, దుబారాలకీ తక్కువేమీ లేదు, మా వెంకట్రావుకి

వెంకట్రావు : అదిగో, అందుకే నువ్వు టక్కరువని అనేది. ఇదివరకు వెంకట్రావూ, వెంకట్రావూ అని నాకు వినబడలేదనుకుని అనే దానివి. యిప్పుడు మొఖం మీదనే అంటున్నావు. ఎన్ని చెప్పినా నీకు మొగుడంటే భయమా, భక్తా? పెళ్ళిలోనే గంధం పూసినట్టు పూసి, చెంపదెబ్బ కొట్టిన అచ్చాణీవి నువ్వు.

కాంతం : నా మొగుణ్ణి నేననుకుంటే తప్పా? అప్పుడంటే చిన్న వయసు. తరవాతేమన్నా కొట్టానా చెప్పండి? చిన్నప్పుడు పెద్ద పిలకముడి, ఎన్నడూ సరిగా కుదిరి చావని తలపాగా, పెద్ద మీసాలు – ఏదో హవ్యం, కవ్యం లాంటి చిన్న సంసారం. మీరు మూడు పూటలా ఆ వెధవ తేనీళ్ళు తాగాలి కాని, నేను నెలకి కోరిన రవిక గుడ్డ కొనుక్కుంటే యిదయిపోయేవారు. కోరిన సొమ్ములు ఎప్పుడూ లేవు గదా!

వెంకట్రావు : అందుకేగా మీ అక్కయ్యతో కుట్రపన్ని, సుబ్బమ్మ చేయించుకున్న మురుగులు తీసుకున్నావు? దారులుకొట్టే రకం మీది?

కాంతం : అప్పుడప్పుడు తీర్చే పద్ధతిమీదే గదండీ అవి తీసుకుంది? అయినా అవి చూసి మీరు కూడా ముచ్చటపడ్డారుగా? యిప్పుడనడం దేనికి? మీ బడిపంతులు జీతంలో ఒక్కసారి బంగారం మురుగులు కొనడం సాధ్యమయ్యే పనేనా?

వెంకట్రావు : ఎప్పుడూ బడిపంతులు బడిపంతులు అంటూ వుంటావు –

బడిపంతులు అంటే నీకు అంత చులకనా?

కాంతం : మీ పంతుళ్ళది మరీ అన్యాయమండీ! "చైనా ఎక్కడుందిరా" అని అడిగితే చిన్న వెధవ ఎక్కడ పెట్టాడో ఏమో, చెప్పలేకపోతే, కొట్టడమేనా?

వెంకట్రావు : అయితేనేం, నువ్వు మా బడిపిల్లల ముందు కూడా నన్ను పరాభవించాలా?

"ఏవండోయి, యివాళ పంతులుగార్ని రాముడు ఎదిరించాడటే" అనీ, "యివాళ పంతులుగారికి పరాభవం జరిగిందటే" అనీ ఆనందం ఎందుకు? నా పరువు తీయడానికే గదా!

కాంతం : అదా! మీరేమో – "ఆర్యుల ఆహారము ఏమిటిరా" అని అడిగారట. పండ్లు, కాయలు, అని వాళ్ళు చెప్పారట. ఇంకా ఏం తినే వాళ్ళురా" అన్నారట మీరు. "గోళ్ళు" అన్నారట వాళ్ళు. మీరు ఎప్పుడూ క్లాసులో కూడా గోళ్ళు తింటుంటారుగా అందుకు. అయినా, ఏమండి, యింత నాగరికత బలిసి, బిఏ, బిఎల్‌లు ప్యాసయి కూడా గోళ్ళు తింటుంటే వాళ్ళు అనరూ మరి! ఇంకా నయం, "మీసాలు చీకే వాళ్ళు" అనలేదు. సంతోషించండి.

వెంకట్రావు : అయితే, నేను మీసాలు చీకుతాననా?

కాంతం : చీకకపోతే, మీకెందుకండీ ఉలుకు?

వెంకట్రావు : ఎంతసేపూ, నా తప్పులు చెప్పడం, నీ గొప్పలు చెప్పుకోవడం – అంతే కదా!

కాంతం : మాకెందుకులెండి గొప్పలు: పల్లెటూరివాళ్ళం. స్నేహితుల్ని భోజనాలకి పిలిచి, గోంగూర పచ్చడితో అన్నం పెట్టి, గొప్పలు చెప్పుకున్నది ఎవరండీ? ఓడలు రాకపోవడంవల్ల బంగాళా దుంపలు మంచివి దొరకడంలేదనీ, బజారులో కూరలు తాజావి లేవనీ, అది గుంటూరు గోంగూర అనీ, దాని ప్రాశస్త్యాన్ని గురించి వర్ణించి, సుగుణాలు చెప్పి, కౌణ్యేయ శాస్త్రంలో కూడా దాన్ని నిషేధించినట్టు నిదర్శనం లేదనీ లేనిపోని సొరకాయ కోతలు ఎందుకు?

వెంకట్రావు : అందుకని, నువ్వు సత్యహరిశ్చంద్రుడి స్వంత చెల్లెలు లాగ, మన గుంటూరు నుంచి గోంగూర ఎప్పుడు తెప్పించాం" అని నిజం చెప్పి, నా పరువు తియ్యాలా, వాళ్ళతోపాటు నువ్వు కూడా నవ్వాలా?

కాంతం : అందుకనేగా, అలకవచ్చి, అయ్యగారు ఆ అరవ్వాడి హొటలు కెళ్ళి అన్నం మెతుకులు వేయించుకు పూడిసింది?

వెంకట్రావు : అప్పటికి, విస్తారం తింటే వాడు ఏమనుకుంటాడోనని, అర్థాకలిగానే తిన్నాను. పెరుగు పోసినందుకు, నెయ్యి వేసినందుకు, మొత్తం పదణాలు చార్జి చేశాడు వాడు. "పూడుస్తారా" అంటే "ఇప్పుడు కాదులే, రేపు" అని ఇంటికి వచ్చి మళ్ళీ నీతో కూర్చుని తింటేగాని కడుపు నిండలేదనుకో.

కాంతం : మరింకేం!

వెంకట్రావు : అయినా, నువ్వు నీ కుట్రలతోటీ, టక్కరు తనంతోటీ, నన్ను చాలా అవమానాల పాలు చేశావు. అవునా, కాదా?

కాంతం : ఏమిటో?

వెంకట్రావు : నీకు ఇంగ్లీషు నేర్పడానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ పడనిచ్చావు కాదు గదా! అటు బళ్ళో పిల్లలూ వినకా, యిటు ఇంట్లో పెళ్ళామూ వినకపోతే ఎల్లాగ? పరిషత్పత్రిక యిచ్చి చదవమంటే, దాన్ని తీసికెళ్ళి, రాచ్చిప్ప మీద మూత పెడతావా? యింత సాహిత్యమంటే గిట్టని దానిని నాలాంటి కవికి భార్యవా?

కాంతం : పోనిద్దురూ –రాచ్చిప్ప మీద మూత పెట్టుగోడానికైనా పనికొచ్చింది మీ సాహిత్యపత్రిక.

వెంకట్రావు : అందులో నీతి పాఠం చెప్పి, దేశానికి ఎంతో ఉపకారం చేసే వ్యాసాలు ఎన్ని ఉంటాయో నీకేం తెలుసే!

మురుగేశం పిళ్లెగారు వ్రాసింది –

"కంబడీ లూలా మాలంపు సవ్వడి నెటిగి,

యా మంకుని బింకంపు బొంకులకు

గొంకక, నింకెటిగడ్డి –" అని ప్రారంభిస్తే,

"చాలు చాలు, ఆపెయ్యండి. యివి అరవ పాటలు

నాకు యిటువంటి మంగళ హారతివచ్చు.
యిది తెలుగు అని దబాయిస్తారేం" అని
పై పెచ్చు నవ్వుతావు!

కాంతం : అయినా ఎందుకండీ, ఆ పనికిమాలిన పత్రికలు - దుబారా ఖర్చు.

వెంకట్రావు : అవునే, నేను ఎంత జాగ్రత్తగా నాలుగు కొట్లలో విచారించి, ఒక అర్ధణా తక్కువకే తెచ్చినా నీకు అది తెలివి తక్కువ బేరంలా కనిపిస్తుంది. పక్కనే జగన్నాథం కూడా ఉన్నాడంటే, "వాడొకడు మీకు తోడు ఖర్చు చేయడానికి" అని తీసిపారేస్తావు. ఇంటి దగ్గర కూర్చుని, బజారు నుంచి చచ్చీ చెడీ బేరం చేసి తెస్తే, వంకాయలు లేతగా లేవు. చీర పండులాగా ఎర్రగా లేదు అని వంకలు బెట్టడం అనుకున్నావా? చీర తెస్తే, అబ్బె యిది పదిహేను రూపాయలు చెయ్యదు, సుబ్బమ్మ పది రూపాయలకే కొంది అంటావు. పొరపాటున ఏదైనా పారేస్తే యిక నీ సాధింపు ఆపలేం కదా!

కాంతం : అవునండీ, నిక్షేపంలాంటి అయిదు రూపాయల గొడుగు ఎక్కడో పారేసుకుని వస్తిరి. మీకు రూపాయి బెట్టి రవిక కొందామంటే ఒప్పదు. అయిదు రూపాయలు పెట్టితే పట్టు రవిక వచ్చేదే; బియ్యం కొంటే పది రోజులు సరిపోయేవి. చింతపండు కొంటే ఆరు నెలలు సరిపోయేది. రెండు వీశల నెయ్యి వచ్చేది. కిరసనాయిలు డబ్బా కొనే వాళ్ళం గదా! - ఆఖరికి మా తమ్ముడు బఠాణీలకి కాణీ అడిగితే లేదన్నారు. అయిదు రూపాయలకి ఎన్ని బఠాణీలు వచ్చేవో, అటువంటి గొడుగు పారేసుకు వస్తే బాధగా వుండదూ? ఏదన్నా అంటే గొడుగులు రోజూ పోతాయా అంటారు.

వెంకట్రావు : మరి నువ్వు ఆ రావిచెట్టు కింద అరవ్వాడి దగ్గిర అణాన్నర చవక అని చెప్పి, కాయ కిరసనాయిల్ అని పాడు బూడిద నీళ్ళు యిస్తే, తేలేదా! చవక అని డజను పావలాకి తెచ్చిన అగ్గిపుల్లల్లో ఒక్కటైనా వెలిగిందీ?

కాంతం : అబ్బ, ఎన్నిసార్లు అంటారండీ, ఆ సంగతి ఏదో వాడు అమ్మా,

యిది రహస్యంగా ఉంచు. షావుకారికి తెలియకుండా తెచ్చిన సొమ్ము యిది. ఎంత వస్తే అంతే కదా". అనబట్టి గదా నేను మోసపోయింది? ఈ సాధింపు కబుర్లు మానేసి మంచి కబుర్లు ఏమన్నా చెబుదురూ.

వెంకట్రావు : ఏమున్నాయబ్బా, మంచికబుర్లు: మన సుబ్బమ్మ ఎల్లా ఉందో?

కాంతం : దానికేం! నిక్షేపంగా షోగ్గా వుంటుంది. అందగత్తె కదా నేనంటే పల్లెటూరి మొద్దుని. అది వస్తే మీ చూపు దాని మీద నుంచి మళ్ళుతుందా ఏమన్నానా? పైగా సౌందర్యంగల ఏ వస్తువు నయినా, సౌందర్యం కోసమే ప్రేమించవచ్చును - అని నీతి బోధ చేస్తారు. మళ్ళీ మీదాకా వస్తే అనుమానం, కోపం!

వెంకట్రావు : అందుకని కుట్ర పన్ని, నువ్వు మొగవేషం వేసుకుని మీ అక్కకి నీ చీరకట్టి, నాటకం ఆడతావా?

కాంతం : అంతేనండి. మీ మగవాళ్ళు - మీరు ఎవరితోనైనా సరదాగా మాట్లాడితే సహించాలి. అదే పెళ్ళాం యింకో మగాడితో పొరబాటునయినా మాట్లాడితే, మీ మగమహారాజులకి మతిపోతుంది.

వెంకట్రావు : అయినా, నన్ను నువ్వు ఎప్పుడూ వెర్రి పుల్లాయ కింద కట్టావే గాని, కవినన్న గౌరవం కాస్తయినా యిచ్చావా ఎప్పుడన్నా?

కాంతం : మీ సాహిత్యం, మీ కథలు నాకు తెలియనివా! మల్లంరెడ్డో, పుల్లంరెడ్డో అని దెయ్యం కథలు రాయడం, మీరు భయపడి, మమ్మల్ని భయపెట్టి, మునిసిపల్ లాంతరు వెలుగు నీడల్ని చూసి, దొంగలని హడలగొట్టి చంపడమేగా: యిష్టం లేకపోతే, నా గురించి యిల్లు ఊడవదు, లాంతర్లు శుభ్రంగా తుడవదు, భర్తను గౌరవించదు. కొంటెపిల్ల, అల్లరి జంతువు, గోల చేస్తుందని రాస్తారు మీ కసి తీరేటట్లుగా! లేకపోతే, ప్రేమ ఒలకబోస్తూ కాంతం వంటి మంచి భార్య, సుగుణవతి, ప్రేయసి, అటువంటిది ప్రపంచకంలో లేదు అని రాస్తారు. అంతేగా!

వెంకట్రావు : అయినా నీకు బొత్తిగా కవితాభావం లేదే కాంతం! నేను చచ్చిపోతే, ఆంధ్రపత్రిక వాళ్ళు కీ.శే. మ.రా.శ్రీ. "నా" గురించి రాసి, బొమ్మ వేస్తారనీ, మా గోష్ఠి మిత్రులు సంతాపసభ జరిపి, గొప్పగా చెప్పుకుంటారనీ, చావాలనుకుంటే పడనివ్వలేదు నువ్వు. పోనీ, చచ్చిపోయే ముందైనా కాస్త గ్రాంథికం మాట్లాడదామని, "కాంతం చేరువకు రమ్ము. నాకంత్యకాల మాసన్నమైనది" అంటే "సన్నం" కావడమేమిటి, ఏదో నెపం, పలకరించటానికి" అని చులకన చేస్తావు, ఇక స్నేహితులతో చెపితే, ముందు వాళ్ళ బాకీలు తీర్చి చావమని వాళ్ళు. చివరికి విసుగు వచ్చి, చద్దామన్నా వీల్లేక చచ్చే చావయింది.

కాంతం : సంతోషించాం లెండి! "ఘటాకాశం", "మిథ్యావాదం" అంటూ తిరిగే ఆ గోపాలంగారి సహవాసంతోనేగా మీకీ పైత్యం అబ్బిందీ?

వెంకట్రావు : పోనీగానీ, కాంతం – ఎన్నో ఏళ్ళు గడిచిపోయినా, గత సంఘటనలు యీ రకంగానైనా జ్ఞాపకం వస్తున్నాయి. ఆ శ్రీనివాసులు గారి కనకం మళ్ళీ కనిపించిందా?

కాంతం : అవునండోయ్, మళ్ళీ ఆ పిల్ల కనబడనేలేదు. "ధరణికోట వారి కనకం, యింకా చిన్నపిల్ల. మా కాంతం దగ్గిర తర్ఫీదు యిస్తే రాటు తేలుతుంది" అని మీరేగా కితాబు యిచ్చారు!

వెంకట్రావు : ఎబ్బే! నేను గాదే! మునిమాణిక్యంగారు యిచ్చారు. ఆయన కూడా, చివరికి నేను తెచ్చే వంకాయల్లాగా, నువ్వు కూడా ముదిరిపోయావనో ఏమో, మనల్ని గురించి రాయడం తరవాత మానుకున్నారు.

కాంతం : అయితేనేం, ఆయన రాసినవి చాలవాండీ! ఏమండీ, తిలకం బొట్టు కోసం మీ మీదగా వంగి కిటికీలోంచి తీసుకోబోతుంటే, మీరు చేసిన చిలిపి చేష్టలు, మన గిల్లికజ్జాలు, సరదాలు, అన్నీ నిన్నో మొన్నో జరిగినట్లుగా అనిపించడం లేదూ? – ఏమండీ – మనం రేపు ముసలాళ్ళమయిపోయాక కూడా, యిల్లాగే వుంటామా? మనల్ని ఎవరైనా పోల్చుకుంటారా?

| | | |
|---|---|---|
| వెంకట్రావు | : | ‘ఓసీ’ అమాయకురాలా! మనల్ని పరిచయం చేసిన మునిమాణిక్యం గారి చేతిలో పడ్డాక, మనది నిత్యనూత్న యౌవనమే! ఆనాటి కాంతం – యీనాటికీ, ఏనాటికీ – అదే కాంతమనే, పిచ్చిదానా, ఎల్లా మారుతుంది? |
| కాంతం | : | అది సరేగాని, ముందీ సంగతి చెప్పండి. రేపటికి – బెండకాయ కూర చెయ్యకుండా పులుసు చేసేదా? పులుసు చేసి, బెండకాయ కూర మానేసేదా! లేక రెండూ మానేసి, కంది పచ్చడి జీలకర్ర వేసి నూరేదా? |
| వెంకట్రావు | : | మళ్ళీ అదే సమస్యనా?<br>బెండకాయ పులుసు మానేస్తే ఏంకూర? |
| కాంతం | : | బెండకాయ పులుసు రాదు, పులుసు మానేస్తే బెండకాయ కూరొస్తుంది. |
| వెంకట్రావు | : | అమ్మబాబోయ్ – నాకు చిక్కుగా వుంది గాని, దానిని మీ తమ్ముడు దగ్గరికెళ్ళి 'Simple equation' లోకి మార్పించుకురా, పో!<br>నాకు నిద్రొస్తూంది. |

(1950)